క్లుప్తంగా

దత్తాత్రేయ స్వామికి విశేష పూజలు

శ్రీశైలం టెంపుల్: లోకకల్యాణం కోసం దేవస్థానం గురువారం ఆలయ ప్రాంగణంలోని త్రిఫలవృక్షం కింద వెలసిన దత్తాత్రేయస్వామి వారికి విశేషపూజలను నిర్వహించింది. పూజా కార్యక్రమం నిర్విఘ్నంగా జరిగేందుకు ముందుగా మహాగణపతి పూజను జరిపించారు. తరువాత దత్తాత్రేయస్వామి వారికి పంచామృతాభిషేకం, విశేషపూజలు నిర్వహించారు.

సాగు హక్కు పత్రం పొందాలి

ఆత్మకూరు: మండలంలోని కౌలు రైతులు తప్పనిసరిగా సీసీఆర్‌సీ కార్డు లేదా పంట సాగు హక్కు పత్రం తీసుకోవాలని మండల వ్యవసాయాధికారి డి.విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు. గురువారం ఆయన పట్టణంలోని రైతు భరోసా కేంద్రాలను తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ సీసీఆర్‌సీ కార్డు ఉంటేనే అన్నదాత సుఖీభవ, పంట నమోదు, పంటబీమా, ఇన్‌పుట్ సబ్సిడీ తదితర వ్యవసాయ పథకాలు కౌలు రైతుకు వర్తిస్తాయన్నారు. కౌలు రైతులు స్థానిక రైతు భరోసా కేంద్రాన్ని సంప్రదించాలన్నారు.

ఉచిత ఇసుక అమలు చేయాలి

నందికొట్కూరు: ఉచిత ఇసుకను వెంటనే అమలు చేయాలని సీపీఎం నాయకులు నాగేశ్వరరావు, పక్కీర్‌సాహెబ్, గోపాలకృష్ణ డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఉచిత ఇసుక పేరుతో కాలయాపన చేయడంతో ట్రాక్టర్ ఇసుక రూ.8 వేలు పలుకుతోందన్నారు. ఇసుక పాలసీ విధి విధానాలు తక్షణమే అమలు చేయాలని కోరారు. సమావేశంలో సీపీఎం నాయకులు రాము, వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతతో ఆరోగ్యం



బాలింతకు ఐరన్ మాత్రలు పంపిణీ చేస్తున్న దృశ్యం

కొత్తపల్లి: ప్రతిఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచడంతో ఆరోగ్యంగా ఉంటామని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగేశ్వరమ్మ అన్నారు. గురువారం ఎర్రమఠం గ్రామంలో డయేరియాపై అవగాహన కల్పించారు. అనంతరం గృహసందర్శన చేసి బాలింతలకు, పాఠశాలలో విద్యార్థులకు ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు, ఐరన్, క్యాల్షియం మాత్రలను పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ చంద్రశేఖర్, అంగన్‌వాడీ టీచర్లు, ఆశ వర్కర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చెడువ్యసనాలకు దూరంగా ఉండాలి

కొత్తపల్లి: అటవీ ప్రాంతంలో జీవించే గిరిజనులు చెడువ్యసనాలకు దూరంగా ఉండాలని, బీసీజీ టీకాతోనే క్షయవ్యాధి నిర్మూలన సాధ్యమవుతుందని ఆత్మకూరు టీబీ యూనిట్ సూపర్ వైజర్ రవికుమార్ అన్నారు. గురువారం మండల పరిధిలోని శివపురం గూడెంలో గిరిజనులకు బీసీజీ టీకా, క్షయవ్యాధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ క్షయవ్యాధి నిర్మూలనలో భాగంగా 18 సంవత్సరాలు పైబడిన వారు తప్పకుండా బీసీజీ టీకా వేయించుకోవాలని సూచించారు. మద్యపానం, ధూమపానం, గుట్కా వంటి అలవాటు ఉన్న వారికి క్షయవ్యాధి సోకే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో ఆర్‌డీటీ కార్యకర్త లచ్చమ్మ, తదితరులు పాల్గొన్నారు.

పొలంలో నక్క మృతి



నక్క కళేబరాన్ని పరిశీలిస్తున్న అధికారులు

కొత్తపల్లి: గువ్వలకుంట్ల గ్రామ సమీపంలోని ఓ వ్యవసాయ పొలంలో నక్క మృతి చెందింది. గ్రామస్తులు అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇవ్వడంతో ఫారెస్టు బీట్ ఆఫీసర్ ఆబీద సంఘటన స్థలానికి చేరుకున్నారు. నక్క కళేబరాన్ని పరిశీలించి మృతిగల కారణాలను పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం నక్క కళేబరాన్ని ఆత్మకూరు డివిజన్ కార్యాలయానికి తరలించారు. ఈ సందర్భంగా ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్ స్వరూప్ మాట్లాడుతూ పొలాలకు వేసిన మందులు నాకడం వల్ల చనిపోయిందా, ఇతర కారణాల వల్ల మృత్యువాత పడిందా వివరాలు పోస్టుమార్టం రిపోర్టు ఆధారంగా వెల్లడిస్తామన్నారు. వన్యప్రాణుల సంరక్షణకు ప్రత్యేక కృషి చేస్తున్నామన్నారు.

వేలాల్లో పెరిగిన ఆదాయం

మహానంది: బండిఆత్మకూరు మండలం పార్నపల్లె, నంద్యాల పట్టణంలోని ఆలయాలకు చెందిన భూములకు గురువారం నిర్వహించిన కౌలు వేలాల ద్వారా రూ. 31.07లక్షలు ఆదాయం వచ్చినట్లు ఈఓ నాగప్రసాద్ తెలిపారు. పార్నపల్లెలోని శ్రీ వీరభద్ర దేవస్థాన 23.29 ఎకరాల భూములకు గతేడాది రూ. 6,11,000 రాగా ఈ ఏడాది రూ.8,33,000 ఆదాయం వచ్చిందన్నారు. శ్రీ ఆంజనేయ, వేణుగోపాలస్వామి ఆలయాలకు చెందిన 52.20 ఎకరాలకు గతంలో రూ.10,13,000రాగా ఈఏడాది రూ. 16,12,000 వచ్చిందని చెప్పారు. నంద్యాలలోని కాకుంట్ల లక్ష్మయ్య, గంగ్రకోట సుబ్బమ్మ గార్ల అన్నదాన సత్రానికి చెందిన 16.94 ఎకరాల భూములకు గతేడాది రూ. 4,89,000 వచ్చిందని, ప్రస్తుతం రూ. 6,62,000 వచ్చిందని వివరించారు. నంద్యాల డివిజన్ ఇన్‌స్పెక్టర్ శశికుమార్ పాల్గొన్నారు.

అప్రమత్తతే ఆరోగ్యానికి రక్ష

- వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం
- ప్రారంభంలోనే వైద్యులను సంప్రదించి వైద్యం చేయించుకోవాలి
- నిర్లక్ష్యం చేస్తే ప్రాణాలకే ముప్పు
- పరిసరాలు, వ్యక్తిగత శుభ్రత పాటించాలంటున్న వైద్యులు



జూపాడుబంగ్లాలో జ్వరం బారిన పడిన వ్యక్తి వివరాలు తెలుసుకుంటున్న వైద్యుడు గంగాధర్, వైద్యసిబ్బంది

జూపాడుబంగ్లా: వర్షాకాలంలో మురుగునీటి నిల్వల వల్ల దోమల సంతతి పెరిగి విపరీతంగా దోమలు వ్యాప్తి చెందే అవకాశం ఉంది. దోమకాటు వల్ల టైఫాయిడ్, డెంగీ, మలేరియా, చికున్‌గున్యా, మెదడువాపు వంటి విషజ్వరాలతో పాటు తాగునీరు కలుషితం కావటం వల్ల డయేరియా, పచ్చకామెర్లు వంటి సీజనల్ వ్యాధులు వ్యాపించే అవకాశాలున్నాయి. ఈ వ్యాధుల బారిన పడిన వారు వెంటనే అప్రమత్తం కాకపోతే ప్రాణాలుకోల్పోయే ప్రమాదం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ఇటీవల నందికొట్కూరు నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో అతిసారం ప్రబలిన నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, తగు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

పరిశుభ్రతతో వ్యాధులు దూరం

వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవడం వల్ల వ్యాధులు దరిచేరవని వైద్యులు పేర్కొంటున్నారు. పరిసరాల్లో మురుగునీటి నిల్వల్లేకుండా, పాతటైర్లు, తాగిపారవేసిన కొబ్బరిబొండాలు, పాత సామగ్రి, చెత్తాచెదారం వంటివి లేకుండా చూసుకోవాలి. దోమలు అధికంగా గాలిచొరబడకుండా చిత్తడిగా ఉండే కొబ్బరి బొండాలు, పాతటైర్లలో నిల్వ ఉన్న నీళ్లు, అధిక రోజులు వాడకుండా ఉంచిన నీళ్లపై దోమలు గుడ్లుపెడతాయి. తద్వారా గుడ్లు లార్వాదశకు చేరుకోవటం వల్ల దోమల సంతతి పెరుగుతుంది. అలాగే ఇళ్లముందున్న మురుగునీటి కాల్వల వల్ల దోమలు అధికంగా వ్యాపిస్తాయి. వాటి నివారణ నిమిత్తం ప్రతి శుక్రవారం డ్రైడేను పాటించటంతో పాటు పరిసరాల్లో మురుగునీటి నిల్వల్లేకుండా శుభ్రంగా ఉంచుకోవాలి. అలాగే మురుగునీటి కాల్వల్లో దోమలు వ్యాపించుండా కిరోసిన్, వేస్టు ఆయిల్, దోమల నివారణ మందులు పిచికారీ చేసుకోవాలి. వీటితో పాటు దోమకాటుకు గురికాకుండా రాత్రివేళల్లో దోమతెరలను తప్పనిసరిగా వినియోగించుకోవాలి.

కాచివడగట్టిన నీటినే తాగాలి

కాచివడగట్టిన నీటిని మాత్రమే తాగాలి. కలుషితమైన, సద్దిపడిన, చల్లని ఆహారపదార్థాలు తినడం, కలుషితమైన నీటిని తాగటం వల్ల వాంతులు, విరేచనాలతో డయేరియా (అతిసారం) బారిన పడే ప్రమాదం ఉంది. డయేరియా బారిన పడిన వారు వెంటనే వైద్యులను సంప్రదించి చికిత్సలు చేయించుకోవాలి. నిర్లక్ష్యం చేస్తే ప్రాణాలు కోల్పోయే ప్రమాద ఉందని వైద్యులు పేర్కొంటున్నారు.

వ్యాధులపై అవగాహన, నివారణకు ప్రత్యేక చర్యలు

సీజనల్‌గా వ్యాపించే వ్యాధులపై వైద్య, ఆరోగ్య సిబ్బంది ఎప్పటికప్పుడు అవగాహన కల్పించటంతో పాటు ఇంటింటికీ వెళ్లి వ్యాధుల నివారణకు పాటించాల్సిన జాగ్రత్తలను సూచిస్తున్నారు. పదిరోజుల క్రితం చాబోలు గ్రామంలో డయేరియా వ్యాపించి గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులకు గురైన నేపథ్యంలో మండలస్థాయి అధికారులు మండలం వ్యాప్తంగా అన్ని గ్రామాల్లోని పంచాయతీ కార్యదర్శులను అప్రమత్తం చేశారు. తాగునీటి ట్యాంకులను శుభ్రం చేయించటంతో పాటు తాగునీటిపైపుల లీకేజీ, తాగునీటి కలుషితం వంటి వాటిపై ఆరాతీసి నివారణ చర్యలు చేపట్టారు.

డ్రైనేజీలు, తాగునీటి ట్యాంకులు శుభ్రం చేయాలని ఆదేశించాం



ప్రస్తుతం సీజనల్‌గా వ్యాపించే అంటువ్యాధులను దృష్టిలో పెట్టుకొని గ్రామాల్లోని తాగునీటి ట్యాంకులు ప్రతి పక్షం రోజులకోపర్యాయం శుభ్రం చేసి క్లోరినేషన్ చేయాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించాం. అలాగే మురుగు కాల్వలను శుభ్రం చేసి బ్లీచింగ్ పౌడరు చల్లించాలని ఆదేశించాం. వీటితో పాటు తాగునీరు కలుషితం కాకుండా ట్యాంకులపై తప్పనిసరిగా మూతలు వేయించాం. తాగునీటి పైపులు లీకేజీతో నీరు కలుషితం అవుతున్నట్లయితే వెంటనే వాటికి మరమ్మతులు నిర్వహించాలని ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు సూచించాం.

– నూర్జహాన్, ఎంపీడీఓ, జూపాడుబంగ్లా

ఇంటింటికీ వెళ్లి సీజనల్ వ్యాధుల వ్యాప్తిపై ఆరా



సీజనల్‌గా వ్యాపించే మలేరియా, డెంగీ, డయేరియా, టైఫాయిడ్, చికున్‌గున్యా, మెదడువాపు వ్యాధి వంటి వ్యాధుల వ్యాప్తిపై ఇంటింటికీ వెళ్లి ఆరోగ్య, ఆశ కార్యకర్తలు ఆరా తీస్తున్నారు. ఎవరికైనా అంటువ్యాధులు వ్యాపించినట్లు తెలిస్తే వారికి సత్వరమే వైద్యసేవలు అందించంతో పాటు మెరుగైన వైద్యం కోసం నందికొట్కూరు, కర్నూలు ఆసుపత్రులకు తరలిస్తున్నారు. వ్యాధుల బారిన పడినవారు నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యం చేయించుకోవాలి.

–యశ్విని, పారుమంచాల ప్రాథమిక వైద్యురాలు

150 మందికి గుండెవ్యాధుల పరీక్షలు



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న డ్యాం ఎస్ఈ శ్రీరామచంద్రమూర్తి

శ్రీశైలంప్రాజెక్ట్: ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ శ్రీశైలం బ్రాంచ్ చైర్మన్ కె.నాగేషు ఆధ్వర్యంలో గురువారం సున్నిపెంటలోని కృష్ణవేణి కళ్యాణ మండపంలో గుండె వ్యాధుల ఉచిత పరీక్షా శిబిరాన్ని నిర్వహించారు. శ్రీశైలం డ్యాం ఎస్ఈ శ్రీరామచంద్రమూర్తి వ్యాధినిర్ధారణ పరీక్ష శిబిరాన్ని ప్రారంభించారు. కర్నూలు కిమ్స్ వైద్య బృందం 150 మందికి ఉచితంగా బి.పి., షుగర్., ఇ.సి.జి., 2 డిఎకో పరీక్షలను నిర్వహించారు. రోగులకు అవసరమైన మందులను అందజేశారు. గుండె సంబంధిత వ్యాధులు ఉన్న వారిని గుర్తించి మెరుగైన వైద్యం చేయించుకోవాలని సూచించారు. వ్యాధి నిర్ధారణ శిబిరంలో డాక్టర్.విజయలక్ష్మి, డాక్టర్స్ ల్యాబ్ టెక్నిషియన్ హిదాయితుల్లా తదితరులు సేవలను అందించారు.

గ్రామాభివృద్ధికి సమష్టిగా కృషి చేద్దాం

మహానంది: బండిఆత్మకూరు మండలం వెంగళరెడ్డిపేట గ్రామాభివృద్ధికి సమష్టిగా కృషి చేద్దామని సర్పంచ్ పల్లె నాగమణి పిలుపునిచ్చారు. గ్రామంలో గురువారం గ్రామాభివృద్ధి, వివిధ పనులపై గ్రామసభ నిర్వహించారు. సర్పంచ్ మాట్లాడుతూ గ్రామంలోని పరిసరాలను శుభ్రంగా ఉంచేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. పార్నపల్లె గ్రామంలో సర్పంచ్ షేక్ షబ్బీర్ అహమ్మద్ ఆధ్వర్యంలో పారిశుద్ధ్య పనులు చేపట్టారు. జేసీబీ ద్వారా కాలువల్లోని పూడికతీత పనులు చేయించారు.

పారిశుద్ధ్య చర్యలు చేపట్టండి



డాక్టర్లతో మాట్లాడుతున్న అడిషనల్ డీఎంఅండ్‌హెచ్‌ఓ శారద

పాములపాడు: గ్రామంలో పారిశుద్ధ్య చర్యలు తీసుకోవాలని అడిషనల్ డీఎంహెచ్‌ఓ శారద ఆదేశించారు. మండలంలోని మిట్టకందాల గ్రామంలో అతిసార కేసులు నమోదవుతుండటంతో గురువారం గ్రామాన్ని సందర్శించారు. గ్రామంలో ఎక్కడ చూసినా చెత్తా చెదారం పేరుకుపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. గురువారం 2 కేసులు మాత్రమే నమోదవడంతో అతిసారం వ్యాప్తి తగ్గుముఖం పట్టిందని చెప్పారు. అయినప్పటికి 24గంటలు వైద్యశిబిరం కొనసాగించాలని సూచించారు. ప్రజలకు ఏ మాత్రం అనారోగ్యం అనిపించినా వెంటనే వైద్యశిబిరంలో చికిత్సలు నిర్వహించాలని, సిబ్బంది అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ఓహెచ్‌ఎస్‌ఆర్ ట్యాంకుల్లో నీటిని క్లోరినేషన్ చేయాలని సచించారు.

శుద్ధ నీటిని సరఫరా చేయాలి

గ్రామంలో ప్రజలందరికీ శుద్ధ నీటిని సరఫరా చేయాలని ప్రోగ్రామింగ్ ఆఫీసర్ డాక్టర్ కాంతారావునాయక్ సూచించారు. గురువారం మండలంలోని మిట్టకందాల గ్రామంలోని విలేజ్‌హెల్త్ క్లినిక్‌లో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జూన్ 28 నుంచి గ్రామంలో అతిసారా కేసులు నమోదవుతున్నాయన్నారు. ప్రధానంగా గ్రామంలోని ఎస్సీ కాలనీలో కేసులు ఎక్కువగా నమోదైన విషయాన్ని ప్రస్తావించారు. కాలనీలోని పైపులైన్ 3 చోట్ల లీకేజీ అయ్యిందని చెప్పారు. మురుగు నీరు ఈ పైపులైన్ల పైనే ప్రవహించడంతో నీరు కలుషితమై అతిసారం వ్యాప్తి చెందిందని తెలిపారు. ఇప్పటి వరకు గ్రామంలో 36 అతిసారా కేసులు నమోదయ్యాయని వివరించారు. ఇందులో ఆరుగురు కర్నూలులో, ఇద్దరు ఆత్మకూరు చికిత్స పొందుతుండగా మిగతావారందరు త్వరగా కోలుకున్నారన్నారు. ఏది ఏమైనా గ్రామంలో నీటి విషయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఎంపీడీఓ సరస్వతి, డాక్టర్లు నాగలక్ష్మి, గులాబ్ షా, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మన్యం వీరుడు అల్లూరి జయంతి



శ్రీశైలం ఐటీడీఏ కార్యాలయంలో అల్లూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న పీఓ, అధికారులు

శ్రీశైలంప్రాజెక్ట్: స్వాతంత్ర్య సమరయోధుడు, మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతిని శ్రీశైలం ప్రాజెక్ట్‌లో ఘనంగా నిర్వహించారు. శ్రీశైలం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి డాక్టర్ బి.రవీంద్రారెడ్డి అల్లూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. భారతదేశ స్వాతంత్ర్యం కోసం వీరమణం పొందిన గొప్ప పోరాటయోధుడిగా సీతారామరాజును అభివర్ణించారు. కార్యక్రమంలో అధికారులు ఎ.సురేష్‌కుమార్, లత పాల్గొన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అల్లూరి సీతారామరాజు జయంతిని ప్రిన్సిపాల్ డా.ఎం.బుచ్చయ్య, అధ్యాపకులు జరుపుకున్నారు. అటవీశాఖ కార్యాలయంలో అధికారులు వి.నరసింహులు, షేక్.బషీర్ అహమ్మద్, తదితరులు చిత్రపటానికి నివాళులర్పించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ ఆర్.మారెన్న, ఎన్ఎస్ఎస్ అధికారి అబూబక్కర్ ఆధ్వర్యంలో జయంతి వేడుకలు నిర్వహించారు. భగత్‌సింగ్ కాలనీలో ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు వై.ఆశీర్వాదం ఆధ్వర్యంలో జయంతి కార్యక్రమం నిర్వహించారు.

నందికొట్కూరు: యువత అల్లూరి సీతారామరాజును ఆదర్శం తీసుకోవాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సునీత పిలుపునిచ్చారు. గురువారం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అల్లూరి సీతారామరాజు 127 జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ అల్లూరి త్యాగాన్ని అందరూ స్మరించుకోవాలన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు పరిమళ, చిట్టెమ్మ, గోవిందరాజులు,పాల్గొన్నారు.

ఆత్మకూరు: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలను ప్రిన్సిపాల్ రఘురామాచార్యులు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అనంతరం పదోన్నతిపై ప్రిన్సిపాల్‌గా పత్తికొండ జూనియర్ కళాశాలకు వెళ్లనున్న మైమున్నీసాను అధ్యాపకులు సన్మానించారు. కళాశాలలో బైపీసీ మొదటి సంవత్సరంలో 60కు 60 మార్కులు పొందిన మనోజ్ అనే విద్యార్థికి రూ.500 నగదును అందించారు.

పచ్చదనమే భూతాపానికి విరుగుడు



ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మొక్కలు నాటుతున్న డీడీ సాయిబాబా



మొక్క నాటుతున్న అటవీశాఖ అధికారులు

ఆత్మకూరురూరల్: రోజుకురోజుకు పెరుగుతున్న భూతాపాన్ని తగ్గించాలంటే భూమిపై పచ్చదనం పరుచుకోవాలని ఎన్ఎస్‌టీఆర్ ఆత్మకూరు అటవీ డివిజన్ డిప్యూటీ డైరెక్టర్ వి. సాయిబాబా అన్నారు. వనమహోత్సవంలో భాగంగా గురువారం ఆయన స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో, మండలంలోని నల్లకాల్వ గ్రామంలోని యూపీ పాఠశాలలో మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణలో కీలకమైనది పచ్చదనమేనన్నారు. భూమి నివాస యోగ్యంగా ఉండాలంటే ఉష్ణోగ్రతలపై నియంత్రణ ఉండాలని, అది మొక్కలు పెంచడం ద్వారానే సాధ్యమని స్పష్టం చేశారు. భూవైశాల్యంలో కనీసం 33 శాతం అడవులుంటేనే మనిషి మనుగడ సాధ్యమని వివరించారు. పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులతో మొక్కలు నాటించారు. ఎఫ్ఆర్‌ఓలు పట్టాభి, సుభాష్, ఎఫ్ఎస్‌ఓలు, ఎఫ్‌బీవోలు, ఏబీవోలు, ప్రొటక్షన్ వాచర్లు పాల్గొన్నారు.

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలంప్రాజెక్ట్ కాలనీలో గురువారం వనమహోత్సవ కార్యక్రమాన్ని అటవీశాఖ చేపట్టింది. బీసీ గురుకుల పాఠశాలలో మొక్కలు నాటారు. ఈసందర్భంగా బయోడైవర్సిటీ అసిస్టెంట్ కన్జర్వేటర్ ధనరాజ్, రేంజ్ అధికారి వి.నరసింహులు మాట్లాడుతూ దేశంలో అన్ని గ్రామాలు కాంక్రీట్ జంగిల్‌గా మారుతున్నాయని, ప్రతి ఇంటా మొక్కలు లేక వాతావరణం కలుషితమవుతుందన్నారు. మానవులు, పరిశ్రమలు వెదజల్లే కాలుష్యం వలన ఆక్సిజన్ శాతం రోజురోజుకు తగ్గుతుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి జీవవైవిధ్యాన్ని కాపాడుకోవాలని హితవు పలికారు. బీసీ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ బి.జవహర్, ఎఫ్ఎస్ఓ కె.మదన్‌కుమార్, ఎఫ్‌బీఓ రవీంద్రనాథ్ ఠాగూర్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరులో అగ్ని ప్రమాదం

ఆత్మకూరు: పట్టణంలోని కొత్తపేట సమీపంలో సిద్ధపల్లి రస్తాలోని అగ్నిమాపక కేంద్రం సమీపంలో గురువారం ప్రమాదవశాత్తు గడ్డివామి దగ్ధమైంది. పట్టణంలోని మహబూబ్‌బాషాకు చెందిన ఈ గడ్డివామికి ఆకస్మాత్తుగా మంటలు వ్యాపించాయి. దీంతో కాలనీవాసులు సమీపంలోని ఫైర్ స్టేషన్‌కు సమాచారమివ్వడంతో అగ్నిమాపక కేంద్రాధికారి భీముడునాయక్ హుటాహుటిన సిబ్బందితో ఫైర్ ఇంజన్‌ను తీసుకెళ్లి మంటలను ఆర్పి వేశారు. ప్రమాదంలో రూ.లక్ష దాకా ఆస్తి నష్టం వాటిల్లినట్లు బాధితుడు వాపోయాడు.

భర్త, బంధువులు దాడిచేశారని ఫిర్యాదు

మహానంది: భర్త, బంధువులు తనపై దాడి చేశారని మసీదుపురం గ్రామానికి చెందిన కాకనూరు మహాలక్ష్మి గురువారం ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ నాగేంద్రప్రసాద్ తెలిపారు. గోస్పాడు మండలం యాళ్లూరుకు చెందిన మహాలక్ష్మికి మసీదుపురం గ్రామస్తుడు బాలగంగాధర్‌రెడ్డితో వివాహమైంది. అయితే భర్త వేధిస్తుండటంతో గోస్పాడు పీఎస్‌లో గతంలో ఫిర్యాదు చేసింది. కేసు వాపసు తీసుకోవాలని మహాలక్ష్మిపై భర్తతో పాటు బంధువులు దాడి చేశారు. నలుగురిపై కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నామన్నారు.

విద్యాసంస్థల బంద్ ప్రశాంతం

నందికొట్కూరు: కేంద్ర విద్యాశాఖ మంత్రి వెంటనే రాజీనామా చేయాలని విద్యార్థి సంఘాల నాయకులు మద్రిస్వామి, నవీన్ డిమాండ్ చేశారు. గురువారం దేశవ్యాప్తంగా తలపెట్టిన విద్యాసంస్థల బంద్‌కు పట్టణంలోని ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు స్వచ్ఛందంగా సహకరించారు. ప్రభుత్వ పాఠశాలలు యథావిధిగా నడపడంతో విద్యార్థి సంఘాలు హెచ్‌ఎంలతో మాట్లాడి పాఠశాలలను మూయించారు. కర్నూలు–గుంటూరు ప్రధాన రహదారిపై నీట్ పరీక్ష పేపర్ లీకేజీపై సమగ్ర విచారణ చేపట్టాలని విద్యార్థి సంఘాలు నిరసన వ్యక్తం చేశారు.

పాఠశాలలను బంద్ చేయించిన నాయకులు

జూపాడుబంగ్లా: నీట్ పరీక్ష ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం విద్యార్థి సంఘాల నాయకులు మండలకేంద్రమైన జూపాడుబంగ్లాలోని మోడల్, ఉన్నత పాఠశాలలను బంద్ చేయించారు. పాఠశాలలను యథావిధిగా ప్రారంభించగా ఉదయం 10.30గంటల సమయంలో ఏఐఎస్‌ఎఫ్, పీడీఎస్‌యు, ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘాల నాయకులు పాఠశాలల వద్దకు చేరుకొని పాఠశాలలను బంద్ చేయించి విద్యార్థులను ఇళ్లకు పంపించారు.

సుప్రీం కోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ చేపట్టాలి

పగిడ్యాల: నీట్, నెట్ పరీక్షల్లో జరిగిన పేపర్ లీకేజీ, అక్రమాలపై సుప్రీం కోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ చేపట్టాలని ఏఐఎస్ఎఫ్ తాలుకా నాయకులు వినోద్ డిమాండ్ చేశారు. గురువారం చేపట్టిన విద్యా సంస్థల బంద్ సందర్భంగా మండలంలోని స్థానిక జిల్లాపరిషత్, ఆదర్శ పాఠశాల, పడమర ప్రాతకోట, నెహ్రూనగర్ జిల్లా పరిషత్ పాఠశాలలను బంద్ చేయించారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ మండల నాయకులు నాగేషు, చందు, జూబేర్ బాష, బాలు తదితరులు పాల్గొన్నారు.



కర్నూలు-గుంటూరు ప్రధాన రహదారిపై ఆందోళన చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

బంద్ విజయవంతం

ఆత్మకూరు: విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఆత్మకూరు పట్టణంలో గురువారం చేపట్టిన బంద్ విజయవంతమయ్యింది. పీడీఎస్‌యూ, ఏఐఎస్ఏ, ఎస్ఎఫ్ఐ, వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో నీట్, నెట్ పరీక్షల లీకేజీల కారణంగా గురువారం కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా విద్యాసంస్థలను బంద్ చేయించారు. పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షులు జునైద్‌బాషా, ఏఐఎస్ఏ జిల్లా కార్యదర్శి నాగార్జున, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి దినేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు కిట్ల పంపిణీ

వెలుగోడు: మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్, ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థులకు గురువారం పాఠ్యపుస్తకాలు, కిట్లు పంపిణీ చేశారు. మాజీ ఎంపీపీలు అన్నారపు సీతమ్మ, సీతా మహాలక్ష్మమ్మ, మాజీ సర్పంచ్ ఎంఏ కలాం చేతుల మీదుగా విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్స్, బెల్ట్‌లతో కూడిన కిట్‌లను అందజేశారు. మాజీ ఎంపీపీ అన్నారపు సీతమ్మ మాట్లాడుతూ.. ప్రైవేట్ పాఠశాలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందించడం జరుగుతోందని, విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలన్నారు.

10న ధర్నా

ఆత్మకూరు: బీజేపీ ప్రభుత్వం నిరంకుశంగా పార్లమెంట్‌లో చర్చ లేకుండా తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 10వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టే ధర్నాను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు వి.యేసురత్నం, పట్టణాధ్యక్షులు రజాక్, కార్యదర్శి రామ్‌నాయక్ పిలుపునిచ్చారు. గురువారం వారు మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం ప్రభుత్వ రంగ పరిశ్రమలను కారుచౌకగా కార్పొరేట్ శక్తులకు ధారాదత్తం చేస్తోందన్నారు. ప్రభుత్వ రంగాన్ని కాపాడుతానని, ధరలు అదుపు చేస్తానని, నిరుద్యోగ సమస్యలను పరిష్కరిస్తానని వాగ్దానం చేసిన బీజేపీ ప్రభుత్వం ఆ దిశగా పాలన సాగించడం లేదన్నారు.

వైద్యశాలకు మందుల విరాళం



మందులు విరాళంగా అందిస్తున్న దాత

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానానికి గురువారం హైదరాబాద్‌కు చెందిన అరవింద్, ఎక్సెల్లా కంపెనీ చైర్మన్ వనమాల వేణు రూ.2 లక్షల విలువ చేసే పలు రకాల మందులను విరాళంగా ఇచ్చారు. దేవస్థాన వైద్యశాలలో విధులు నిర్వహిస్తున్న అపోలో డాక్టర్లు శశిధరరావు, కిషన్లకు ఈ మందులను అందజేశారు.

నీలినాలుక వ్యాధిపై అప్రమత్తంగా ఉండండి

జూపాడుబంగ్లా: జీవాల్లో నీలినాలుక(బ్లూటంగ్) వ్యాధి వ్యాప్తి పట్ల పెంపకం దారులు అప్రమత్తంగా ఉండాలని పశుసంవర్ధకశాఖ అసిస్టెంటు డైరెక్టర్ రామాంజనేయనాయక్ సూచించారు. గురువారం జూపాడుబంగ్లా, భాస్కరాపురం గ్రామాల్లో జీవాలకు ఉచితంగా బ్లూటంగ్ వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఏడీ రామాంజనేయనాయక్ మాట్లాడుతూ వర్షాకాలంలో జీవాలకు అధికంగా బ్లూటంగ్ వ్యాధి వ్యాపిస్తుందన్నారు. ఈ వ్యాధి జీవాల షెడ్లల్లో అపరిశుభ్రత కారణంగా దోమలు వ్యాపించటం వల్ల, కలుషితమైన నీటిని, మేతను తినటం వల్ల సోకే అవకాశం ఉందన్నారు.

రేపు కుక్కలకు యాంటీ రేబిస్ టీకాలు

ఈనెల 6న ప్రపంచ జూనోసిస్ దినోత్సవాన్ని పురస్కరించుకొని కుక్కలకు ఉచితంగా యాంటీ రేబిస్ టీకాలు వేయనున్నట్లు పశుసంవర్ధకశాఖ అసిస్టెంటు డైరెక్టర్ రామాంజనేయనాయక్ తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జులై 6న కుక్కకాటుకు గురై రేబిస్ వ్యాధి బారిన పడిన పిల్లవానికి లూయిస్ పాశ్చర్ అనే శాస్త్రవేత్త టీకామందు వేసి బ్రతికించిన సందర్భాన్ని పురస్కరించుకొని జూనోసిస్ దినోత్సవంగా జరుపుకుంటారని తెలిపారు. పశుపక్షాదుల నుంచి మనుషులకు 180రకాల జబ్బులు వ్యాపించే అవకాశాలున్నాయన్నారు. వాటిల్లో రేబిస్, ఆంత్రాక్స్, బ్రూసెల్లోసిస్, క్షయ మొదలైన ఉన్నాయన్నారు. ఈనెల 6న జూపాడుబంగ్లా, పగిడ్యాల మండలాల్లోని పశువైద్యశాలలు, రైతు సేవా కేంద్రాల్లో ఉచితంగా కుక్కలకు టీకాలు వేస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని కుక్కల పెంపకం దారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

దేశం గర్వించదగ్గ వ్యక్తి అంబేడ్కర్



అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పాములపాడు: మేధాసంపత్తితో తాను చేసిన సేవలతో దేశం గర్వించదగ్గ వ్యక్తిగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఎదిగారని వైఎస్సార్‌సీపీ మండల ఉపాధ్యక్షుడు, సొసైటీ మాజీ చైర్మన్ రమణారెడ్డి అన్నారు. మండలంలోని వేంపెంట గ్రామంలో గురువారం నాటికి భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహ ప్రతిష్ఠ చేసి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహానికి పూల మాల వేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఆనందరావు, సామేలు, దళిత సంఘాల నాయకులు ు పాల్గొన్నారు.

గుండెపోటుతో లీడింగ్ ఫైర్‌మెన్ మృతి



సత్యరాజు (ఫైల్)

కర్నూలు: అగ్నిమాపక శాఖ కర్నూలు కేంద్రం లీడింగ్ ఫైర్‌మెన్ పి.సత్యరాజు (59) గుండెపోటుతో మృతిచెందారు. నందికొట్కూరు నియోజకవర్గ పరిధిలోని నాగలూటి గ్రామానికి చెందిన సత్యరాజు బుధవారం ఉదయం నుంచి అస్వస్థతగా ఉండటంతో ఇంటి దగ్గరే ఉన్నాడు. గురువారం ఉదయం కడుపు ఉబ్బరం కావడంతో పాటు తీవ్ర అస్వస్థతకు గురికావడంతో కుటుంబ సభ్యులు వైద్య చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అప్పటికే గుండెపోటు కారణంగా మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ప్రాంతీయ అగ్నిమాపక అధికారి భూపాల్‌రెడ్డి, జిల్లా అగ్నిమాపక అధికారి అవినాష్ జయసింహతో పాటు అసోసియేషన్ సభ్యులు, సహోద్యోగులు ఆయన ఇంటి వద్దకు చేరుకుని నివాళులర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. మృతుడిరకి భార్య రత్నమ్మ, ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు. స్వగ్రామం నాగలూటిలో శుక్రవారం అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

అందరి మనస్సులు గెలుస్తా



ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి దంపతులకు జ్ఞాపిక అందిస్తున్న ఈఓ నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి

మహానంది: అభివృద్ధి పనులు చేయడంతో పాటు సమస్యలను పరిష్కరించి పార్టీలకు అతీతంగా అందరి మనస్సులు గెలుచుకుంటానని శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి అన్నారు. మహానందీశ్వరుడి దర్శనార్థం గురువారం మహానందికి వచ్చిన ఆయనకు ఈఓ నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి స్వాగతం పలికారు. దర్శనం అనంతరం ఎమ్మెల్యే విలేకరులతో మాట్లాడుతూ మహానంది–గాజులపల్లె మార్గంలో పెండింగ్‌లో ఉన్న రహదారి నిర్మాణం గతంలో కొన్ని లోపాల వలన ఆగిపోయిందని, త్వరలోనే ప్రతిపాదనలు తయారు చేయించి రహదారి నిర్మాణం, పాలేరువాగుపై వంతెన నిర్మిస్తామన్నారు. శ్రీశైలం, మహానంది ఆలయాలకు త్వరలోనే నూతన పాలకమండలి నియమిస్తామన్నారు. అనంతరం ఎమ్మెల్యేను ఆలయ ఉద్యోగులు ఘనంగా సన్మానించారు.

సమస్యల పరిష్కారానికే ప్రాధాన్యత

శ్రీశైలం నియోజకవర్గంలో ప్రధాన సమస్యలను పరిష్కరించేందుకు ప్రాధాన్యత ఇస్తానని ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి అన్నారు. తమ్మడపల్లె, అబ్బీపురం గ్రామాల్లో గురువారం రాత్రి రచ్చబండ, థాంక్స్ ఫర్ ఓటింగ్ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా చూస్తామన్నారు. ఆయన వెంట ఎంపీపీ బుడ్డారెడ్డి యశస్విని, మాజీ ఎంపీపీ నాగభూపాల్‌రెడ్డి, నాయకులు సూరె శ్రీనివాసులు, గోపవరం రంగస్వామి తదితరులు పాల్గొన్నారు.